
సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 4 । మే । 2025





గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం







పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న గర్భిణీ, కుమార్తెకు తోడుగా అమ్మ, రూమ్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు, బ్యాగ్ చెక్ చేస్తున్న సెక్యూరిటీ

తగరపువలస/మధురవాడ: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) నిర్వహిస్తున్న గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు శనివారం జిల్లాలో ప్రారంభమయ్యాయి. జిల్లాలోని పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు పరీక్ష సజావుగా జరిగింది. ఆనందపురం మండలం పాలవలస పంచాయతీ గుడిలోవలోని ఏక్యూజే స్టడీస్ సెంటర్‌ను 600 మంది అభ్యర్థులకు కేటాయించగా తొలి పేపర్‌కు 370 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించారు. అదనంగా 15 నిమిషాల గ్రేస్ సమయం కూడా ఇచ్చారు. కొందరు అభ్యర్థులు హాల్ టికెట్లు, ఐడీ కార్డులు మరచిపోగా.. నిర్వాహకులు వారికి డౌన్‌లోడ్ చేయించి అనుమతించారు. అయితే పరీక్ష కేంద్రం చిరునామా పాలవలసకు బదులుగా గండిగుండంగా పేర్కొనడంతో కొద్దిమంది అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. కేంద్రం వద్ద ఆనందపురం లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అలాగే పీఎంపాలెంలోని సాంకేతిక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో కూడా గ్రూప్–1 మెయిన్స్ ప్రశాంతంగా ప్రారంభమైంది. ఇక్కడ 590 మంది అభ్యర్థులకు కేటాయించగా.. 389 మంది హాజరయ్యారు. రూమ్ నంబర్లను సూచించే బోర్డులు చిన్నవిగా ఉండటంతో అభ్యర్థులు గదులను వెతుక్కోవడానికి కొంత ఇబ్బంది పడ్డారు. అలాగే మెయిన్ గేట్ నుంచి పరీక్ష గదులు సుమారు 200 మీటర్ల దూరం ఉండటంతో.. దివ్యాంగులు, గర్భిణులు నడవటానికి ఇబ్బంది పడ్డారు. సెల్ ఫోన్లు, వాచీలు వంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు.

• ఇంతలో ఎన్నెన్ని వింతలో...




కొద్ది రోజులుగా విచిత్రమైన వాతావరణం నగరవాసులను ఆశ్చర్యపరుస్తోంది. పగటిపూట.. ముఖ్యంగా మధ్యాహ్నం వరకు భానుడి ప్రతాపంతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు.. సాయంత్రం మూడు గంటలు దాటగానే ఒక్కసారిగా మారుతున్న వాతావరణంతో వింత అనుభూతికి లోనవుతున్నారు. శనివారం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం వరకు ఎండ దంచి కొట్టినా.. ఆ తర్వాత పరిస్థితి మారిపోయింది. ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. కారుమబ్బుల మాటున మెరుపులు మెరిశాయి. ఉరుములు వినిపించాయి. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు పలకరించాయి. ఈ జల్లులతో అధిక ఉష్ణోగ్రతల నుంచి ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. అంతేకాదు ఆకాశంలో అద్భుత దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. దట్టమైన మబ్బులు వింత ఆకారాలను సంతరించుకోగా.. ఈ మార్పుల నడుమ ఆకాశంలో ఇంద్రధనస్సు ప్రత్యక్షమై మంత్రముగ్ధులను చేసింది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

న్యూస్‌రీల్

చంద్రమౌళి కుటుంబానికి ఎంపీ బాబూరావు పరామర్శ



చంద్రమౌళి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ గొల్ల బాబూరావు

ఏయూ క్యాంపస్: ఉగ్రవాదుల దాడిలో మరణించిన పాండురంగాపురానికి చెందిన జె.ఎస్. చంద్రమౌళి కుటుంబాన్ని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు శనివారం పరామర్శించారు. ముందుగా చంద్రమౌళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. చంద్రమౌళి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. సమాజం పట్ల బాధ్యత, సేవాగుణం కలిగిన మంచి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జి.వి.రవిరాజు, బొడ్డేటి గంగా మహేష్, కొటకల కుమార్, ద్వారం సంతోష్ కుమార్, సోడి విమల్, చంగల శ్రీను, తెల్లబల్లి శ్రీను, ఉప్పాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాల పెంపు




ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాలు పెంచారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ డీజీఎం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర కార్మిక శాఖ ఉత్తర్వుల మేరకు పెంపుపై నిర్ణయం తీసుకున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. స్కిల్డ్ కార్మికులకు రోజుకు రూ. 25, సెమీ స్కిల్డ్‌కు రోజుకు రూ. 21, అన్ స్కిల్డ్ కార్మికులకు రోజుకు రూ.19 చొప్పున వేతనం పెరగనుందని ఉక్కు శ్రామిక సంఘం గౌరవాధ్యక్షులు బొడ్డు పైడిరాజు తెలిపారు. వేతనాల పెంపు ఏప్రిల్ 1 నుంచి అమల్లో రానున్నట్టు పేర్కొన్నారు.

రేపు సమాచార కమిషనర్ రాక

బీచ్‌రోడ్డు: రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శ్యామ్యూల్ జోనథన్ సోమవారం నగరానికి రానున్నారు. ఆయన విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో ఉదయం 6.30 గంటలకు రైల్వేస్టేషన్‌కు చేరుకుని.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అతిథి గృహానికి వెళ్తారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని సైకాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. తిరిగి రాత్రి ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో గుంటూరు వెళ్తారు.

నేడు భగీరథ మహర్షి జయంతి



బీచ్‌రోడ్డు: సగరుల కుల దైవం భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఆదివారం జీవీఎంసీ 71వ వార్డు దుర్గానగర్(గాజువాక)లో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పాల్గొని.. భగీరథుని విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. భగీరథ మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయి కార్యక్రమం గాజువాకలో జరగనుంది.

లారీకి రూ. 10 వేలు!



10వ తేదీలోగా పంపించాల్సిందే.. • లేదంటే కేసులు పెడతామని హెచ్చరిక

- రవాణాశాఖకు సంబంధం లేని వ్యక్తి నేరుగా బెదిరింపులు
- డిపార్ట్‌మెంట్ అంటూ కార్యాలయంలోనే తిష్ట
- సంచలనంగా ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యాలకు పంపిన ఆడియో

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

'ఈ నెల 10వ తేదీలోగా నా వద్దకు వచ్చి.. కన్ఫర్మ్ చేసుకోండి. 10వ తేదీన జాబితా సిద్ధమవుతుంది. 11వ తేదీ నుంచి ఎవరైనా పట్టుకుంటే నాకు సంబంధం లేదు. ఫోన్ పేలు ఎవరూ చేయవద్దు' అంటూ అనకాపల్లి జిల్లాలో అధిక లోడుతో వెళుతున్న, అనుమతి లేని వాహనాల విషయంలో వసూళ్లకు సంబంధించిన ఆడియో మెసేజ్. ఈ ఆడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. అసలు ఏ శాఖకు సంబంధం లేని ఓ వ్యక్తి ధైర్యంగా ఆడియో మెసేజ్ ట్రాన్స్‌పోర్టు యాజమాన్యాలకు పంపి వసూళ్లకు తెగబడుతున్నాడంటే.. సదరు వ్యక్తికి ఎంతమేర అధికారుల నుంచి అండదండలున్నాయో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి ప్రతి నెలా లారీకి



ఇంత చొప్పున అటు మైనింగ్, ఇటు ఫ్లైయాష్.. అంతేకాకుండా సెజ్‌లకు వెళ్లే బస్సుల యాజమాన్యాలు రవాణాశాఖ అధికారులకు పైకం చెల్లించాల్సిందే. లేకుంటే దాడులు చేసి కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. ఈ వ్యవహారమంతా ఒక ప్రైవేటు వ్యక్తి ద్వారా రవాణాశాఖ అధికారులు నడిపిస్తున్నారనే విమర్శలున్నాయి. అనకాపల్లిలో ఉంటున్న పార్థసారధి అనే వ్యక్తి ఈ ఆడియో మెసేజ్ పంపినట్టు తెలుస్తోంది. సదరు వ్యక్తే రవాణాశాఖ అధికారులకు జిల్లా మొత్తం నుంచి వసూలు చేసి వాటాలు పంపుతున్నట్టు విమర్శలున్నాయి. రవాణా శాఖకు సంబంధం లేని సదరు వ్యక్తి.. ఎప్పటికప్పుడు రవాణాశాఖ కార్యాలయంలోనే తిష్టవేసి ఉంటున్నారని కూడా తెలుస్తోంది. అంతేకాకుండా ట్రాన్స్‌పోర్ట్ యజమాన్యాలకు నేరుగా బెదిరింపులకు దిగుతున్నట్టు ఆరోపణలున్నాయి. మొత్తంగా ప్రతి నెలా రూ.కోటిన్నర మేర వసూలు చేస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి.

ఇదీ వసూళ్ల లెక్క..!

అనకాపల్లి జిల్లాలో సెజ్‌లకు ప్రతి రోజూ వందల సంఖ్యలో బస్సులు తిరుగుతుంటాయి. ఇక మైనింగ్ కూడా జోరుగా సాగుతోంది. ఈ మైనింగ్ లారీలు కూడా వందల్లో తిరుగుతున్నాయి. మరోవైపు రాంబిల్లి వద్ద నిర్మిస్తున్న నావికాదళ స్థావర పనులు సాగుతున్నాయి. ఈ పనులకు కూడా లారీలు బండరాళ్లు తరలిస్తుంటాయి. సింహాద్రి ఎన్‌టీపీసీకి ప్రతి రోజూ బొగ్గు లారీలతో పాటు అక్కడి నుంచి ఫ్లైయాష్‌ను తీసుకెళ్లే లారీలు కూడా పగలు, రాత్రీ తేడా లేకుండా తిరుగుతుంటాయి. ఇవన్నీ కూడా నిర్ణీత పరిమితి మేర లోడ్‌ను తీసుకుని చక్కర్లు కొట్టడం లేదు. ప్రతి వాహనం కూడా అధిక లోడుతోనే వెళుతున్నాయి. ఇదే వసూళ్లకు కేంద్రంగా మారిందనే ఆరోపణలున్నాయి. ఈ విధంగా రాంబిల్లికి నావికాదళ పనుల కోసం ప్రతి రోజూ 800 ట్రిప్పుల మేర బండరాళ్లను తీసుకెళుతున్నాయి. 800 ట్రిప్పుల నుంచి ప్రతీ నెలా రూ. 10 వేల చొప్పున రూ. 80 లక్షల మేర వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక సెజ్‌లకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులను తరలించే వాహనాల నుంచి రూ. 2 వేల నుంచి రూ.3 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ఇవి రూ.20 లక్షల వరకూ ఉంటున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఎన్‌టీపీసీకి వెళ్లే బొగ్గు లారీలు.. అక్కడి నుంచి ఫ్లై యాష్ తీసుకొచ్చే లారీల నుంచి కూడా రూ.8 వేల చొప్పున ప్రతి నెలా వసూలు చేస్తున్నారు. ఇవి మరో రూ.50 లక్షల మేర ఉంటున్నట్టు సమాచారం. ఈ విధంగా వసూలు మొత్తం ప్రతీ నెలా రూ.1.5 కోట్ల మేర ఉంటుందని అంచనా. ఈ మొత్తం వ్యవహారాన్ని సదరు శాఖకు సంబంధం లేని వ్యక్తి చేస్తున్నారనే బహిరంగ విమర్శలున్నాయి. ఎవరైనా పార్థసారధి అడిగిన మేర ఇవ్వకపోతే అధికలోడుతో వాహనాలు వెళుతున్నాయని వెంటనే కేసులు నమోదవుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంతో తమకేమీ సంబంధం లేదని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు.

అటువంటిదేమీ లేదు

ఈ ఆడియోకు మా శాఖకు సంబంధం లేదు. ఎవరు పంపారో తెలియదు. అధిక లోడు, అక్రమంగా రవాణాపై మేం ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నాం. ఏప్రిల్ నెలలో 85 కేసులు రాశాం. తద్వారా అపరాధ రుసుం రూ.65 లక్షల వరకూ విధించాం. అక్రమ రవాణాపై చట్టపరిధిలో కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

– మనోహర్, జిల్లా రవాణాశాఖ అధికారి

గంటా అత్యుత్సాహం... సంప్రోక్షణపై గందరగోళం

- సింహాచలం ఘటన నేపథ్యంలో సంప్రోక్షణ అంటూ హడావుడి
- తీరా ఆలయంలో అలాంటిదేమీ జరగనేలేదు
- రాజకీయ లబ్ధి కోసమేనా?.. గంటా ప్రకటనపై విమర్శలు

సింహాచలం: సింహాచలం కొండపై చందనోత్సవం రోజున గోడ కూలి ఏడుగురు భక్తులు దుర్మరణం పాలైన అత్యంత విషాదకర ఘటన నేపథ్యంలో.. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రదర్శించిన అత్యుత్సాహం విమర్శలకు తావిచ్చింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం సంప్రోక్షణ జరుగుతుందని గంటా ప్రకటించడం తీవ్ర గందరగోళానికి దారితీసింది. అసలు ఎవరిని సంప్రదించి.. ఏ అధికారంతో ఆయన ఈ ప్రకటన చేశారో అంతుబట్ట లేదు. తీరా చూస్తే శనివారం ఆలయంలో అలాంటి సంప్రోక్షణ ఏమీ జరగలేదు. వాస్తవానికి ప్రమాదం జరిగినప్పటి నుంచి సంప్రోక్షణ విషయంపై తీవ్ర చర్చ జరుగుతోంది. అయితే ఆలయ వైదిక వర్గాలు మాత్రం మరో రకంగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన ప్రాంతం మాడ వీధిని దాటి ఉందని, సంప్రోక్షణ అవసరం లేదని భావిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై వారు ఇప్పటికీ అధికారికంగా స్పష్టత ఇవ్వలేదు.

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆచార వ్యవహారాలన్నీ పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం జరుగుతాయి. చందనోత్సవం రోజు రాత్రి స్వామికి అత్యంత పవిత్రంగా భావించే సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకలో పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితులు శ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి స్వయంగా పాల్గొని, దాదాపు ఆరేడు గంటల పాటు ఆలయంలోనే ఉన్నారు. అప్పుడు కూడా సంప్రోక్షణ ప్రస్తావన వచ్చినట్లు లేదు. సాధారణంగా.. ఇలాంటి సంఘటనల అనంతరం సంప్రోక్షణ అవసరమైతే, ఆగమశాస్త్ర పండితులను సంప్రదించి, నిర్ణయం తీసుకుని, ముందుగా తేదీలను ప్రకటిస్తారు. అంతేకాకుండా ఈ విషయంపై ప్రభుత్వం నుంచి కూడా స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉంటుంది. ప్రస్తుతం అవేవీ జరగలేదు. ఇవేమీ పరిగణలోకి తీసుకోకుండానే.. గంటా శ్రీనివాసరావు శనివారం సంప్రోక్షణ జరుగుతుందంటూ ఎలా ప్రకటించారో అర్థం కావడం లేదు. తన నియోజకవర్గంలో భాగంగా ఉన్న సింహాచలం కొండపై తన ఆధిపత్యం ఉండాలని పరితపించే గంటా మరోసారి అత్యుత్సాహం ప్రదర్శించారని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. భీమిలి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఈ 10 నెలల కాలంలో ఆయన సింహాచలం క్షేత్రంలో తన ఉనికిని చాటుకునేందుకు అనేకమార్లు ఇలాంటి అత్యుత్సాహ ప్రదర్శనలు చేశారని పలువురు గుర్తు చేస్తున్నారు. మూడు నెలల కిందట ఎమ్మెల్సీ కోడ్ అమల్లో ఉన్న సమయంలో నిబంధనలను ధిక్కరించి ఆలయ స్లాబ్ మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధికారులు కానీ, వైదికులు కానీ హాజరు కాలేదు. గిరిప్రదక్షిణ, కల్యాణోత్సవం, చందనోత్సవం వంటి ముఖ్యమైన ఆలయ కార్యక్రమాల సమయంలో తన అనుచరులను వెంటపెట్టుకుని మరీ సమీక్షలు, పరిశీలనలు జరిపి తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేశారు. ఈ ఏడాది చందనోత్సవం ఏర్పాట్లను పరిశీలిస్తున్న సమయంలో.. గోడ కూలిన ప్రదేశానికి కూతవేటు దూరంలో ఉన్న క్యూలను పరిశీలిస్తున్నట్లు గంటా ఫొటోలకు ఫోజులిచ్చారు. మెట్ల దగ్గర ఉన్న కీలకమైన గోడను మాత్రం అసలు పరిశీలించనే లేదని తెలుస్తోంది. విషాదం జరిగిన తర్వాత కనీస బాధ్యతతో వ్యవహరించాల్సింది పోయి.. సంప్రోక్షణ వంటి సున్నితమైన అంశంపై అనాలోచిత ప్రకటన చేయడం కేవలం రాజకీయ లబ్ధి కోసమే అన్న విమర్శలు గంటాపై బలంగా వినిపిస్తున్నాయి.

నేడు నీట్ యూజీ ప్రవేశ పరీక్ష

విశాఖ విద్య : దేశంలోని వైద్య విద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు గాను 'నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్' (నీట్) యూజీ–2025 ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 16 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రంలోకి ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచ్‌లు తీసుకురాకూడదు. అడ్మిట్ కార్డు తప్పనిసరిగా తప్పక తెచ్చుకోవాలి. ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలి.

పై కప్పులు నింపేయండి..!

'వంద అడుగులు ఉన్న ప్రతి ఇంటిపైనా పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోండి. బిల్లు ఎక్కువగా వస్తున్న ఇళ్లను టార్గెట్‌గా పెట్టుకోండి. ప్రతి అధికారీ తమ పరిధిలో వీలైనన్ని ఎక్కువ సోలార్ రూఫ్‌టాప్స్‌తో నింపాల్సిందే.' ఏపీఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు. పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగదారులపై బలవంతంగా రుద్దాలంటూ కూటమి సర్కారు డిస్కమ్‌లపై ఒత్తిడి తీసుకొస్తోంది. దీంతో ఈపీడీసీఎల్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

- పీఎం సూర్యఘర్ పథకంపై టార్గెట్స్ విధింపు
- కేంద్రం ఆదేశాలతో ఈపీడీసీఎల్ ఉరుకులు పరుగులు
- తలనొప్పిగా మారిందంటున్న విద్యుత్ శాఖ అధికారులు
- ప్యానెల్స్ పెట్టుకోవాలంటూ వినియోగదారులపై ఒత్తిళ్లు
- ఇప్పటికే డిస్కమ్ పరిధిలో 10 వేల రూఫ్‌టాప్ సోలార్
- విశాఖ జిల్లాలో 1501, అనకాపల్లిలో 756, అల్లూరిలో 6 ప్లాంట్స్ ఏర్పాటు



రూఫ్‌టాప్ సోలార్

సాక్షి, విశాఖపట్నం: మన ఇంట్లోనే సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'ను ప్రవేశపెట్టింది. ఈ పథకంలో చేరాలంటే ముందుగా 'సూర్యఘర్' యాప్‌ని మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేయాలి. ఆరు నెలల కరెంటు బిల్లు కాపీని జతపరచాలి. తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు మాత్రమే ఉండాలన్న నిబంధన ఉంది. తదుపరి ట్రాన్స్‌కో అనుమతులు పొందాక వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలో వాట్‌కు నిర్ణయించిన దాని ప్రకారం రాయితీని అందిస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పించనున్నారు. చివరగా ఇంటి రూఫ్‌పై 100 చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటరు స్థానంలో 'నెట్ మీటర్' ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తి.. వినియోగదారుడు వాడుతున్న విద్యుత్‌ని గణిస్తారు. దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లపైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ పథకం మంచిదే అయినా వినియోగదారుల్ని బలవంతంగా ఒప్పించే ప్రయత్నం చేస్తోంది కూటమి ప్రభుత్వం.

రాయితీలందించినా గుదిబండే.!

రాయితీ ద్వారా ప్రాజెక్టు పెట్టుకోవచ్చంటూ ప్రచారం చేస్తున్నా వినియోగదారుడికి భారం తప్పదు. ఉదాహరణకు 3 కిలోవాట్ల రూఫ్‌టాప్ పెట్టుకోవాలంటే రూ.78 వేల వరకూ గరిష్టంగా సబ్సిడీ అందిస్తామని చెబుతున్నారు. అయితే ఈ రాయితీ మనం వినియోగించుకునే సోలార్ పలకలకు అనుగుణంగా ఉంటుంది. అంటే రూ.78 వేల కంటే తక్కువ సబ్సిడీ వస్తుంది. కానీ.. వినియోగదారుడు మాత్రం రూ.1.8 లక్షల వరకూ భరించాల్సి ఉంటుంది. గతంలో దరఖాస్తుకు, నెట్ మీటర్‌కు కూడా చార్జీలు వసూలు చేసేవారు. ఇప్పుడు ప్రజల దగ్గర నుంచి స్పందన అంతంతమాత్రంగా ఉండటంతో ఈ చార్జీల నుంచి ఉపశమనం కల్పించారు.

ఇంకా ఎక్కువ మందిని ఒప్పించండి..!

ఈపీడీసీఎల్ పరిధిలో ఇప్పటివరకు 10 వేల మంది వినియోగదారులు పీఎం సూర్యఘర్ పరిధిలోకి వచ్చారు. ఇందులో శ్రీకాకుళం జిల్లాలో 1066 మంది వినియోగదారులకు 3,282 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్లు, పార్వతీపురం మన్యంలో 135 మందికి 414 కిలోవాట్లు, విజయనగరం జిల్లాలో 935 మందికి 2,955 కిలోవాట్లు, విశాఖపట్నం 1501 మందికి 5,588 కిలోవాట్లు, అనకాపల్లి 757 మందికి 2378 కిలోవాట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆరుగురికి 22 కిలోవాట్లు, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 561 మందికి 1812 కిలోవాట్లు, కాకినాడ జిల్లాలో 1139 మందికి 4036 కిలోవాట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 1199 మందికి 4099 కిలోవాట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 1228 మందికి 4090 కిలోవాట్లు, ఏలూరు జిల్లాలో 1473 మందికి 4877 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. అయినా ఇంకా టార్గెట్ పూర్తి చేయలేదంటూ విద్యుత్ సిబ్బందిపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తోంది. విద్యుత్ సరఫరాకు సంబంధించిన అంశాల కంటే సూర్యఘర్ ఒత్తిడే ఎక్కువగా ఉంటోందని ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామనీ.. ఎక్కువగా ఆసక్తి చూపించడం లేదని చెబుతున్నారు. సోలార్ ప్యానెల్స్ అమర్చిన తర్వాత పాడైతే దాన్ని బాగుచేసేందుకు అధిక భారమవుతుందని, అందుకే ఎవరూ పట్టించుకోవడంలేదనీ.. అయినా ప్రభుత్వం ఒత్తిడి తీసుకొస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరెంట్ అమ్ముకోండంటూ ప్రచారం!



కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు.. ఇప్పుడు ఎఫ్‌పీసీసీఏ చార్జీలంటూ బిల్లు చూస్తే గుండె గుభేల్‌మనిపించేలా చేస్తున్నారు. సంపద సృష్టించడం తనకు తెలుసన్న చంద్రబాబు ఓవైపు విద్యుత్ బిల్లుల్ని అమాంతం పెంచేసి.. మరోవైపు సూర్యఘర్ ప్రాజెక్టు పేరుతో వినియోగదారుల నడ్డి విరిచేందుకు యత్నిస్తున్నారు. సోలార్ రూఫ్‌టాప్ పెట్టుకుంటే బిల్లు కట్టకపోవడంతో పాటు కరెంటు మీరే అమ్ముకొని లాభాల్ని పొందొచ్చంటూ ప్రజల్ని మభ్యపెడుతున్నారు. అయినా ప్రజలు స్పందించకపోవడంతో అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈపీడీసీఎల్ పరిధిలో సర్కిళ్లలోని జోన్లవారీగా టార్గెట్స్ విధించారు. నిర్దేశించిన సమయంలోగా టార్గెట్ పూర్తి చేయాలని ఆదేశిస్తుండటంతో పీఎం సూర్యఘర్ అధికారుల మెడపై కత్తిగా మారింది.

నవ్వు గురూ..

ఒత్తిడి దూరం చేసే గొప్ప మందు నవ్వు

నవ్వులు పూయిస్తున్న హాస్య క్లబ్‌లు

నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం



1,500లకు పైగా ప్రదర్శనలిచ్చాం



బీఎస్ఎన్ఎల్ ఉద్యోగిగా పని చేస్తూ 2000లో విశాఖ హ్యూమర్ క్లబ్‌ను స్థాపించాను. హాస్యవల్లరి పేరుతో ప్రతి నెలా రెండో ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో క్రమం తప్పకుండా మూడు గంటల పాటు కార్యక్రమం నిర్వహిస్తూ.. నవ్వులు పూయిస్తున్నాం. ఇప్పటి వరకు దాదాపు 1,500కు పైగా ప్రదర్శనలు ఇచ్చాం. క్లబ్ సభ్యులే కాకుండా, ప్రేక్షకులను కూడా భాగస్వాములను చేస్తూ.. వారితో జోకులు చెప్పించి ప్రోత్సహిస్తున్నాం. నా సహోద్యోగులనే క్లబ్ సభ్యులుగా ఎంచుకున్నాను. మా కార్యదర్శి, నా సహోద్యోగి ఎస్.ఎస్.రామానుజం, సభ్యులు ఆర్.ఎస్.ఎన్.మూర్తి (విశ్రాంత తహసీల్దార్), ఇ.భానుప్రకాష్ (మెడికల్ రిప్రజెంటేటివ్), టీవీ కళాకారిణి ఎం.శివజ్యోతి, కె.నాగగణేష్, సూర్యం క్లబ్‌లో కీలక సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. తీరిక సమయాల్లో స్కిట్స్ రూపకల్పన చేసి.. ప్రాక్టీస్ చేసి ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తున్నాం.

– రావి గోపీకృష్ణ, విశాఖ హ్యూమర్ క్లబ్ అధ్యక్షుడు



సీతంపేట: నవ్వితే హ్యాపీ.. నవ్వకపోతే బీపీ! ఇది నేటి ఆరోగ్య మంత్రం. నవ్వు ఒకప్పుడు నాలుగు విధాల చేటు అనుకునేవారు కానీ, ఆధునిక వైద్యులు నవ్వు నలభై విధాల గ్రేటు అంటున్నారు. నవ్వు కేవలం పెదవులపై పుట్టే భావం కాదు. అది ఒక శక్తివంతమైన ఔషధం. సానుకూల దృక్పథం. నవ్వు ఆరోగ్యానికి మూలం. చిరునవ్వుతో ఏదైనా సాధించవచ్చని పెద్దలు చెప్పే మాట అక్షర సత్యం. నవ్వు ప్రాముఖ్యతను గుర్తుచేయడానికి నగరంలోని విశాఖ హ్యూమర్ క్లబ్, లాఫ్టర్స్ ఫన్ క్లబ్, ఫ్రెండ్స్ కామెడీ క్లబ్, క్రియేటివ్ కామెడీ క్లబ్, హాస్యప్రియ కామెడీ క్లబ్‌లు కృషి చేస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూనే కొంత మంది స్నేహితులు క్లబ్‌లుగా ఏర్పడి నెలలో నాలుగు ఆదివారాలు నవ్వులు పూయిస్తున్నారు. ఏటా మే మొదటి ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ ఆదివారం 'నవ్వు ఒక భాష' అనే థీమ్‌తో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో, అల్లూరి విజ్ఞాన కేంద్రంలో లాఫ్టర్స్ ఫన్ క్లబ్ ఆధ్వర్యంలో నాన్‌స్టాప్ కామెడీ కార్యక్రమాలు జరగనున్నాయి.

నవ్వు.. ఎందుకంటే..

ఆధునిక జీవితంలో ఒత్తిడి పెరిగిపోయి.. మనిషి నవ్వుకు దూరమవుతున్నాడు. టీవీ, మొబైల్ ఫోన్ వినియోగం పెరిగిన తర్వాత కుటుంబ సభ్యులు, పిల్లలు, స్నేహితులతో కబుర్లు చెప్పుకుంటూ నవ్వడమే మరిచిపోయాం. కానీ నవ్వు మన ఆరోగ్యానికి అత్యవసరం. ఇది ఒక టానిక్‌లా పనిచేస్తుంది. వైద్యుల ప్రకారం నవ్వడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. కేవలం 10 నిమిషాలు నవ్వితే రెండు గంటల నడకతో సమానమైన శక్తి లభిస్తుంది. నవ్వినప్పుడు మూడు వేల నాడులు పనిచేస్తాయి. నవ్వు మెదడులో 'గామా ఇంటర్‌ఫెరాన్' అనే హార్మోన్‌ను విడుదల చేసి, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మనిషి శిశువుగా ఉన్నప్పుడు రోజుకి 325 సార్లు నవ్వితే.. ఊహ తెలిసిన తర్వాత 200 సార్లు, యుక్త వయసులో 50 సార్లు నవ్వుతాడని.. పెద్దయ్యాక రోజుకు కనీసం మూడు సార్లు నవ్వడం కష్టమని సర్వేలు చెబుతున్నాయి. దీనిని బట్టి మనిషి నవ్వుకు ఎంతగా దూరమయ్యాడో అర్థమవుతుంది. కాబట్టి ఒత్తిడిని తగ్గించుకుని, ఆరోగ్యంగా ఉండటానికి నవ్వండి, నవ్వించండి, నవ్వుతూనే ఉండండి..



నవ్వుల్లో గిన్నిస్ రికార్డ్



ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ కళాకారులు ప్రదర్శిస్తున్న స్కిట్

రకరకాల ఒత్తిళ్లతో మనిషి నవ్వుకు దూరమయ్యాడు. మానసిక ఒత్తిడిని దూరం చేసి.. రెండు మూడు గంటల పాటు నవ్వించే లక్ష్యంతో 2008లో ఐదుగురు స్నేహితులతో కలిసి 'లాఫ్టర్స్ ఫన్ క్లబ్'ను స్థాపించాను. ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించి, ఉల్లాసం అందించేందుకు మా కామెడీ క్లబ్ కృషి చేస్తోంది. స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తూనే.. నవ్వించడాన్ని ఒక ప్రవృత్తిగా మార్చుకున్నాను. ఇప్పటి వరకు రెండు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చాం. ఒక గంట వ్యవధిలో 654 జోకులు చెప్పి 2013లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించాను. 2011లో 35 గంటల పాటు నిర్విరామంగా జోకులు చెప్పి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందాను. 2015లో ఒక్క నిమిషంలో 37 జోకులు చెప్పి మరో లిమ్కా బుక్ రికార్డును సైతం సాధించాను. ఇలా చాలా అవార్డులు, సత్కారాలు అందుకున్నాను. విశాఖలో ప్రత్యేకంగా ఐదారు కామెడీ క్లబ్‌లు ప్రజలను నవ్వించడం కోసం స్వచ్ఛందంగా కృషి చేస్తున్నాయి. మా క్లబ్ ప్రదర్శించే నాన్‌స్టాప్ కామెడీ కోసం ఆదివారం సాయంత్రం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూసే ప్రేక్షకులు ఉన్నారనడంలో అతిశయోక్తి లేదు. నేను, క్లబ్ అధ్యక్షుడు జి.వి.త్రినాథ్, పి.కె.దుర్గాప్రసాద్, ఎన్.ఎస్.ఆర్. కృష్ణారావు, మల్లిక, రమ జోషిత కలిసి స్కిట్స్ ప్రదర్శిస్తుంటాం.

–కోరుకొండ రంగారావు, లాఫ్టర్స్ ఫన్ క్లబ్ వ్యవస్థాపక కార్యదర్శి



ప్రతి నెలా హైదరాబాద్ నుంచి వస్తా..



వృత్తిపరంగా ఆంధ్రా బ్యాంకులో సీనియర్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తూ.. ఒత్తిడి నుంచి రిలాక్స్ అవ్వడానికి అప్పట్లో విశాఖ హ్యూమర్ క్లబ్ నిర్వహించే కామెడీ షోకు హాజరయ్యేవాడిని. వారి ప్రదర్శనకు ఆకర్షితుడినై చాలా సార్లు సాయం అందించాను. స్నేహితుల సలహాతో 2012లో స్వయంగా ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ స్థాపించాను. వినోదవల్లరి పేరుతో ప్రతి నెలా మొదటి ఆదివారం విశాఖ పౌరగ్రంథాలయంలో రెండు గంటల సేపు కామెడీ స్కిట్స్ ప్రదర్శిస్తున్నాం. ఐదేళ్లుగా హైదరాబాద్, గోదావరిఖనిలో కూడా ప్రదర్శనలిస్తున్నాం. దాదాపు రెండు వేలకు పైగా ప్రదర్శనలు పూర్తి చేశాం. బ్యాంకు సీనియర్ మేనేజర్‌గా పదవీ విరమణ చేశాక హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. అయినా హాస్యంపై మక్కువతో ప్రతి నెలా మొదటి ఆదివారం విశాఖ వచ్చి.. క్లబ్ ద్వారా కామెడీ స్కిట్స్ ప్రదర్శించి ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తున్నాను. క్లబ్ కార్యదర్శి ఎస్.వి.రాజేశ్వరి, జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, పోర్టు శేషు, పుష్పమి, నాయుడు, వెంకటేశ్వరరావులతో కలిసి కామెడీ స్కిట్స్ ప్రదర్శిస్తున్నాను.

-ఎం. వి.సుబ్రహ్మణ్యం, ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ అధ్యక్షుడు

ప్రేక్షకులకు ఉచితంగా వినోదం



విశాఖ ప్రజలకు ఉచితంగా వినోదం అందించాలన్న లక్ష్యంతో నేవల్ డాక్‌యార్డులో ఉద్యోగం చేస్తూ.. 2012 నవంబర్‌లో హాస్యప్రియ కామెడీక్లబ్ స్థాపించాను. క్లబ్ కార్యదర్శిగా కొనసాగుతున్నాను. ఇప్పటి వరకు రెండు వేలకు పైగా కామెడీ షోలు ప్రదర్శించాం. ఏయూలో థియేటర్ ఆర్ట్స్‌లో యాక్టింగ్, డైరెక్టర్ కోర్సు పూర్తి చేసి.. నగర శివార్లలో ఎక్కువగా కామెడీ షోలు నిర్వహిస్తుంటాను. రెండేళ్లుగా నగరంలో ప్రతి నెలా నాలుగో ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కామెడీ స్కిట్స్ ప్రదర్శించి.. ప్రేక్షకులను నవ్విస్తున్నాం.

– ఇమంది ఈశ్వరరావు, హాస్యప్రియ కామెడీ క్లబ్ వ్యవస్థాపకుడు

సూత్ర వస్త్ర ప్రదర్శన ప్రారంభం

ఏయూక్యాంపస్: నగరవాసుల అభిరుచులకు అనుగుణంగా.. అత్యుత్తమ డిజైన్లతో కూడిన సరికొత్త వేసవి వస్త్ర, ఆభరణాల సమాహారంతో సూత్ర ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. బీచ్‌రోడ్డులోని నోవాటెల్‌లో శనివారం ఈ ప్రదర్శనను సూత్ర ఉమేష్ మాధ్యం, కె.నీలిమ, లక్ష్మి పత్తి, సునీత దుగార్‌లు సంయుక్తంగా ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ ఎగ్జిబిషన్‌లో దేశం నలుమూలలకు చెందిన ప్రత్యేకమైన వస్త్రాలు, అధునాతన ఆభరణాలు కొలువుదీరాయి. అద్భుతమైన హస్తకళా నైపుణ్యాలను ప్రతిబింబిస్తూ తీర్చిదిద్దిన వస్త్రాలు, పండుగలు, వివాహాలు, ఇతర ప్రత్యేక సందర్భాలకు సరిపోయే ఫ్యాషన్ దుస్తులు ఇక్కడ లభిస్తున్నాయి. సాఖ యూనిక్ క్లాతింగ్, విమా దిలీప్, అపురూప, అన్వయ వేవ్స్, క్రియేటివ్ హబ్స్ వంటి ప్రముఖ డిజైనర్ సంస్థల వస్త్రాలతో పాటు మహాలక్ష్మి జ్యువెలర్స్, తారా జ్యువెలర్స్, ఆర్కే కలెక్షన్ వంటి ప్రసిద్ధ ఆభరణాల తయారీదారుల ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. వేసవి షాపింగ్ అనుభూతిని సరికొత్తగా ఆస్వాదించాలనుకునే ఫ్యాషన్ ప్రియులకు ఈ సూత్ర ప్రదర్శన ఒక చక్కటి వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ సందర్శకులకు అందుబాటులో ఉంటుందన్నారు.



ప్రదర్శన ప్రారంభిస్తున్న సూత్ర ఎండీ ఉమేష్ మాధ్యం, నీలిమ, లక్ష్మి

విమ్స్‌లో అత్యవసర సేవలు అస్తవ్యస్తం

వైద్యుల నిర్లక్ష్యంతో బాలుడికి తీవ్ర ఇబ్బందులు



ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అత్యవసర విభాగమైన క్యాజువాలిటీలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కనిపించడం లేదు. దీంతో విమ్స్ ఆసుపత్రి 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్నట్లుగా తయారైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్యాజువాలిటీ విభాగంలో క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు (సీఎంవోలు), నర్సులు అందుబాటులో లేకపోవడం గమనార్హం.

చికిత్స అందక బాలుడి అవస్థలు

శుక్రవారం జరిగిన ఓ సంఘటన విమ్స్‌లోని అత్యవసర సేవల దుస్థితికి అద్దం పడుతోంది. ఆరిలోవ ప్రాంతం బాలాజీనగర్‌కు చెందిన ఓ బాలుడు తోటి పిల్లలతో కలిసి తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ ఇనుప రాడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో రాడ్డు బాలుడి కడుపులోకి చొచ్చుకుపోయి, పేగులు బయటకు వచ్చేశాయి. కుటుంబ సభ్యులు తీవ్ర గాయాలపాలైన బాలుడిని హుటాహుటిన విమ్స్‌కు తరలించారు. అయితే అక్కడ క్యాజువాలిటీలో సీఎంవో గానీ, ఇతర వైద్యులు(డీఏపీలు, డీవోపీలు) గానీ అందుబాటులో లేరు. అక్కడ ఉన్న సిబ్బందికి.. పేగులు బయటకు వేలాడుతున్న ఆ బాలుడికి ఎలాంటి చికిత్స అందించాలో తెలియని పరిస్థితి నెలకొంది. సీఎంవో వస్తారని దాదాపు 45 నిమిషాల పాటు ఎదురుచూసినా ఫలితం లేకపోయింది. చివరికి సిబ్బంది చేతులెత్తేసి.. బాలుడిని కేజీహెచ్ తీసుకువెళ్లమని సలహా ఇచ్చారు. విమ్స్ అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించాలని బాలుడి బంధువులు ఎంత ప్రాధేయపడినా.. అక్కడి సిబ్బంది మొదట పట్టించుకోలేదు. చివరకు బాలుడి బంధువులు సిబ్బందిని నిలదీయడంతో విమ్స్ అంబులెన్స్‌లోనే బాలుడిని కేజీహెచ్‌కు తరలించారు.

సిబ్బందిపై ఆగ్రహం

విమ్స్ సిబ్బంది నిర్లక్ష్యంపై బాలుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద ఆసుపత్రిలో అత్యవసర వైద్యం అందించడానికి కూడా వైద్యులు అందుబాటులో లేకపోవడం దారుణమని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. శనివారం మధ్యాహ్నం కూడా బాలుడి కుటుంబ సభ్యులు, స్థానికులు విమ్స్‌కు వెళ్లి సిబ్బందిని ఈ విషయంపై నిలదీశారు.

సీఎంవోల నిర్లక్ష్యంపై ఆరోపణలు

విమ్స్ క్యాజువాలిటీలో మూడు షిఫ్టులలో పనిచేయాల్సిన ముగ్గురు సీఎంవోలు.. తమ సొంత క్లినిక్‌ల నిర్వహణలో బిజీగా ఉంటూ ఆసుపత్రి విధులకు సరిగా హాజరుకావడం లేదని రోగులు బంధువులు ఆరోపిస్తున్నారు. అందుకే అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉండటం లేదని చెబుతున్నారు. ఈ పరిస్థితిపై ఆసుపత్రి ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, అత్యవసర విభాగంలో 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

విశ్వదాత అవార్డుకు గంట్ల ఎంపిక



గంట్ల శ్రీనుబాబు

అల్లిపురం: ఆంధ్రపత్రిక వ్యవస్థాపకుడు, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు పేరిట ఏటా అందించే విశ్వదాత అవార్డుకు సీనియర్ పాత్రికేయుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని నిర్వాహకులు శనివారం ప్రకటించారు. కృష్ణాజిల్లా పామర్రు మండలం ఎలకుర్రులోని విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న జరిగే కార్యక్రమంలో శ్రీనుబాబుకు ఈ అవార్డును అందజేయనున్నారు.

వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాలు శనివారం ప్రారంభమయ్యాయి. అండర్-10 నుంచి 16 వరకు నాలుగు కేటగిరీల్లో బాలురకు ఈ శిబిరాలు నాలుగు వేదికల్లో నిర్వహించనున్నారు. మొత్తంగా 1,940 మంది పేర్లను నమోదు చేసుకోగా 450 మందిని ఎంపిక చేశారు. అండర్-10,12,14లతో పాటు 16ల్లోనూ నెలరోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సంఘం కార్యదర్శి పార్థసారథి తెలిపారు. వైఎస్ఆర్ స్టేడియం బి గ్రౌండ్‌తో పాటు మున్సిపల్ స్టేడియం, కోరమాండల్ గ్రౌండ్, ఉక్కుస్టేడియం ప్రాంగణాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. బాలురతో పాటు బాలికలు 50 మంది ఈ శిబిరాల్లో శిక్షణ పొందనున్నారు. వీడీసీఏ ఉపాధ్యక్షుడు డిఎస్ వర్మ అధ్యక్షతన వైఎస్సార్ స్టేడియంలో శనివారం లాంఛనంగా శిక్షణా శిబిరాల ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించగా శిక్షణ సోమవారం నుంచి ఆయా వేదికల్లో జరగనుంది. ఈ కార్యక్రమంలో డీఆర్ఎం లలిత్ బోహ్రా పాల్గొని శిక్షణార్థులతో కాసేపు ముచ్చటించారు. శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న వారికి చివరి వారంలో జట్లుగా పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి రెగ్యులర్ కాంప్‌నకు అవకాశం కల్పించి జిల్లా జట్ల ఎంపికల్లో ప్రాధాన్యత నివ్వనున్నారు.



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం ధర	:రూ.130
బ్రాయిలర్ (లైవ్)	:రూ.150
స్కిన్	:రూ.270
స్కిన్‌లెస్	:రూ.280

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	475.00
విజయనగరం	479.00
శ్రీకాకుళం	479.00

మన్యంలో బంద్ సక్సెస్



పాడేరు పాతబస్టాండ్‌లో బంద్ విరమణ సభలో మాట్లాడుతున్న డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు అప్పలనరస, మాణిక్యం

- రెండో రోజు ఉద్యమించిన గిరిజనం
- నూరుశాతం ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనని డిమాండ్

సాక్షి,పాడేరు/పాడేరు: ఆదివాసీ ప్రజాసంఘాలు, గిరిజన డీఎస్సీ సాధన కమిటీ చేపట్టిన రెండు రోజుల నిరవధిక బంద్ విజయవంతంగా ముగిసింది. జిల్లా కేంద్రం పాడేరులో ఉదయం ఐదు గంటల నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి, జిల్లా పార్టీ అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బైఠాయించి బంద్ చేపట్టారు. ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పాడేరు ఘాట్‌లో బంద్‌ను పర్యవేక్షించారు. పలుచోట్ల రోడ్డుపై కూర్చుని వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు కూడా సురేష్‌కుమార్, కురుసా పార్వతమ్మ, తెడబారికి సురేష్‌కుమార్, జర్సింగి సూర్యనారాయణ, వంతాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన రవాణా

నిరవధిక బంద్ కారణంగా ఏజెన్సీలోని పాడేరుతో పాటు 11మండలాల్లోను రవాణా వ్యవస్థ స్తంభించింది.గిరిజన డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధుల అప్పలనరస, మాణిక్యం, కాంతారావు, సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణ, కె.చిన్ని తదితర నేతలు బంద్‌ను పర్యవేక్షించారు.ఆర్టీసీ డిపో నుంచి 40 సర్వీసులు నడపలేదు.ప్రైవేట్ లారీలు, ఇతర వాహనాలు కూడా నిలిచిపోయాయి. రవాణా పరంగా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దుకాణాలు మూతపడ్డాయి. ముంచంగిపుట్టు, హుకుంపేటలో సంతలు జరగలేదు.

కలెక్టర్ కాన్వాయ్ అడ్డగింపు

కార్యాలయానికి వెళుతున్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ కాన్వాయ్‌ను పాడేరు తలారిసింగి జంక్షన్ వద్ద ఆదివాసీ ప్రజాసంఘాలు, డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు అడ్డుకున్నారు. నూరుశాతం ఉద్యోగాల జీవో 3తో పాటు ప్రత్యేక డీఎస్సీ ప్రకటనపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందని, చర్చలకు పిలిచిందని కలెక్టర్ దినేష్‌కుమార్ వెల్లడించడంతో వారంతా శాంతించారు.

రోడ్డుపైనే వంటావార్పు

ఆదివాసీ ప్రజా సంఘాలు, డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులంతా తలారిసింగి రోడ్డుపైనే వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. ఓవైపు వర్షం కురుస్తున్నా తడుస్తూనే వంటలు చేశారు. గిరిజనులంతా రోడ్డుపైనే భోజనాలు చేశారు. గూడ గ్రామానికి చెందిన గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులు, విద్యార్థులు వంటావార్పులో భాగస్వామ్యం అయ్యారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో ఆందోళనకారులు డప్పు వాయిద్యాలు,థింసా నృత్యాలతో హోరెత్తించారు.

పాడేరులో భారీ ర్యాలీ

కలెక్టర్ దినేష్‌కుమార్‌తో జరిగిన చర్చలు అనంతరం గిరిజన డీఎస్సీ సాధన కమిటీతో పాటు వైఎస్సార్‌సీపీ,ఇతర గిరిజన ప్రజాసంఘాలన్నీ పాడేరు పురవీధుల్లో భారీ ర్యాలీ చేపట్టాయి. గిరిజన డీఎస్సీ ప్రకటించాలని, మెగా డీఎస్సీని రద్దు చేయాలనే డిమాండ్‌తో నినాదాలు హోరెత్తాయి.అనంతరం పాడేరు పాతబస్టాండ్‌లో సభను నిర్వహించారు. రెండు రోజుల మన్యం బంద్‌కు సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు ఉద్యమకారులంతా కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం చర్చలకు పిలవడంతో నిరవధిక బంద్‌ను తాత్కాలికంగా వాయిదా వేశామని, న్యాయం చేయని పక్షంలో మళ్లీ ఉద్యమం తప్పదని డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు అప్పలనరస, మాణిక్యం, కాంతారావు పేర్కొన్నారు.